www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 జనవరి 2024

5

ఏలూరు



ఆర్‌టిసిలో నేడు డ్రైవర్స్ డే



ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రతామాసోత్సవం సందర్భంగా ఈ నెల 24న డ్రైవర్స్ డే నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా రవాణా శాఖాధికారి ఎన్.వి.ఆర్.వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం నిత్యం బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు డ్రైవర్లను 'హ్యాపీ డ్రైవర్స్ డే' అని అభినందించాలని సూచించారు. అభినందన, ప్రోత్సాహం వారిలో ఒక స్ఫూర్తిని నింపుతుందని ఆయన ఆకాంక్షించారు.



విచారణ జరిపారు.. పరిష్కారం మరిచారు..!

'వ్యవసాయశాఖ జిల్లా అధికారి వై.రామకృష్ణకు అండగా నిలుస్తున్నది ఎవరు? ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు అందిన ఫిర్యాదుపై విచారణ జరిపి వాస్తవాలు నిర్ధారణ అయినప్పటికీ సమస్యను పరిష్కరించకపోవడానికి కారణం ఏమిటి.. ఆ శాఖ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారులు తేల్చగా తీసుకుంటున్నారా.. తమగోడు విన్పించేందుకు వ్యవసాయ శాఖ మంత్రిని ఉద్యోగులంతా కలవబోతున్నారా' అంటే అవుననే సమాధానం వస్తోంది.

- జిల్లా వ్యవసాయశాఖ ఉద్యోగుల్లో తీవ్ర వేదన
- జిల్లా అధికారి రామకృష్ణ తీరుపై ఉద్యోగులంతా ఫిర్యాదు
- విచారణ అనంతరం చర్యలు శూన్యంపై సర్వత్రా చర్చ
- తమ గోడు వినేవారు లేరంటూ ఉద్యోగుల్లో అంతర్మథనం
- నిరసనగా ఆ శాఖ వాట్సాప్ గ్రూప్ నుంచి ఉద్యోగులంతా ఎగ్జిట్
- నేడు వ్యవసాయ శాఖ మంత్రిని కలిసేందుకు సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో దాదాపు 80 శాతం ప్రజలకు వ్యవసాయమే ఆధారం. ఏలూరు జిల్లాలో వరితోపాటు, పామాయిల్, పొగాకు, మొక్కజొన్న, మామిడి వంటి పంటలతోపాటు కోకో వంటి అనేక ఉద్యాన పంటలను రైతులు పండిస్తున్నారు. జిల్లాలో అత్యంత కీలకమైన శాఖల్లో వ్యవసాయ శాఖ ఒకటి. ఇక్కడి ప్రజలు నిరంతరం ఆ శాఖ అధికారులతో మమేకమవుతారు. ప్రజలు అత్యంత ప్రధానమైన శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ శాఖ పనితీరుపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. జిల్లాల విభజన తర్వాత జిల్లా వ్యవసాయశాఖాధికారిగా వై.రామకృష్ణ నియమితులయ్యారు. రామకృష్ణ తమను తీవ్రంగా వేధిస్తున్నారని, బూతులు తిడుతున్నారని, ఆయన వేధింపులు తాళలేక ఇప్పటికే పలువురు ఉద్యోగులు మెడికల్ సెలవులు పెట్టి వెళ్లిపోయారని, ఇక భరించలేని స్థాయికి ఆయన వేధింపులు వెళ్లాయని, ఆయన వద్ద ఇక తాము పని చేయలేమంటూ జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగులంతా ఆ శాఖ కమిషనర్‌కు జనవరి మొదటి వారంలో ఫిర్యాదు చేశారు. ఆ శాఖ కమిషనర్ దీనిపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణను పిలిచి మాట్లాడినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్‌ను కూడా ఉద్యోగులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై ఆ శాఖ కమిషనర్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి ఉద్యోగులతో రెండు దఫాలుగా మాట్లాడారు. ఉద్యోగులను, జిల్లా అధికారి రామకృష్ణను కూర్చోబెట్టి సైతం మాట్లాడారు. ఈ విచారణలో ఉద్యోగులపై రామకృష్ణ ఏవిధంగా వేధింపులకు పాల్పడుతున్నారో ఆధారాలతో సహా సిబ్బంది విచారణాధికారి ముందు పెట్టినట్లు సమాచారం. గతంలో ఈయన అనంతపురంలోనూ ఇదేవిధంగా వ్యవహరించినట్లు అప్పట్లో ఆ జిల్లాలో చోటుచేసుకున్న ఆధారాలను విచారణాధికారి ముందుపెట్టినట్లు తెలిసింది. అధికారి, ఉద్యోగుల మధ్య రాజీ కుదరలేదు. నిబంధనల ప్రకారం విచారణ పూర్తయిన తర్వాత సదరు అధికారి రాతపూర్వకంగా నివేదికను ఉన్నతాధికారులు అందిస్తారు. విచారణలో ఉద్యోగులు చేసిన అంశాలపై వాస్తవాలు నిర్ధారణ అయినట్లు తేలితే జిల్లావ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. విచారణ జరిగి రెండోవారం గడుస్తున్నా ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకుండా పోయింది. దీంతో వ్యవసాయశాఖలో ఉద్యోగులంతా తీవ్ర ఆవేదనలో కూరుకుపోయినట్లు తెలుస్తోంది. విచారణ జరిగినా సమస్యను ఎందుకు పరిష్కరించకుండా వదిలేశారో తెలియని పరిస్థితి నెలకొంది.

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసేందుకు సిద్ధం

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో వ్యవసాయ శాఖ ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో మునిగిపోయినట్లు తెలుస్తోంది. అందుకు నిరసనగా వ్యవసాయశాఖ అధికారుల వాట్సాప్ గ్రూపు నుంచి ఉద్యోగులంతా ఎగ్జిట్ అయినట్లు తెలిసింది. ఈ గ్రూప్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారితోపాటు కలెక్టర్, జెసి సైతం ఉంటారు. అంతేకాకుండా వ్యవసాయశాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డిని కలిసి తమగోడును వినిపించేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. సదరు అధికారికి అండగా నిలుస్తున్నది ఎవరనే దానిపై చర్చ నడుస్తోంది.



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

4వ విడత వైఎస్ఆర్ ఆసరా రూ.362.59 కోట్లు

జిల్లాలో 39,574 పొదుపు సంఘాల ఖాతాలకు జమ

3,89,801 మంది మహిళలకు లబ్ధి: కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 39,574 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని 3,89,801 మంది మహిళలకు వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కింద రూ.362.59 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండ బహిరంగ సభ నుంచి మంగళవారం వైఎస్ఆర్ ఆసరా పథకం కింద నాలుగో విడత నిధులు నేరుగా స్వయం సహాయక పొదుపు సంఘాల ఖాతాల్లో సిఎం జగన్ జమ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డిఆర్‌డిఎ పిడి డాక్టర్ ఆర్.విజయరాజు, మెప్మా పిడి ఇమ్మానియేల్, పలు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో డిఆర్‌డిఎ 34,569 మహిళా సంఘాలకు చెందిన 3,43,717 మంది మహిళలకు రూ.319.53 కోట్లు, అర్బన్ ప్రాంతంలో (మెప్మా) 5,005 మహిళా సంఘాలకు చెందిన 46,084 మంది మహిళలకు రూ.43.06 కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారని వివరించారు. చింతలపూడి నియోజకవర్గంలో 6685 మహిళా సంఘాల్లోని 65,922 మందికి రూ.74.91 కోట్లు, దెందులూరు నియోజకవర్గంలో 5,438 సంఘాల్లోని 53,104 మందికి రూ.53.70 కోట్లు, ఏలూరు నియోజకవర్గంలో 3,619 సంఘాల్లోని 33,002 మందికి, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంలో 1,524 మహిళా సంఘాల్లోని 15,251 మందికి రూ.16.09 కోట్లు, కైకలూరు నియోజకవర్గంలో 5,181 సంఘాల్లోని 52,953 మందికి రూ.46.73 కోట్లు, నూజివీడు నియోజకవర్గంలో 5,771 సంఘాల్లోని 59,584 మందికి రూ.53.56 కోట్లు, పోలవరం నియోజకవర్గంలో 6,200 సంఘాల్లోని 59,170 మందికి రూ.44.18 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గంలో 5,156 సంఘాల్లోని 50,815 మందికి రూ.45.63 కోట్లు జమ చేసినట్లు తెలిపారు.

ఏళ్ల తరబడి పోరాడుతున్నా దక్కని న్యాయం

అసైన్‌మెంట్, సీలింగ్ భూముల కోసం చెరువుల వద్దకెళ్తున్న పేదల అడ్డగింత

దోసపాడు చేపల చెరువు వద్ద వ్యకాస ఆధ్వర్యాన పేదల ఆందోళన

ప్రజాశక్తి - దెందులూరు

తమకు చెందాల్సిన భూములను వెంటనే అప్పగించాలని కోరుతూ దళితులు, పేదలు మంగళవారం దోసపాడులో చెరువుల వద్ద ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని పేదలు నినాదాలు చేశారు. దోసపాడు చేపల చెరువు వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసననుద్దేశించి ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదల భూములను బలవంతంగా భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నం రెవెన్యూ అధికారులు చేస్తున్నారని విమర్శించారు. తొలుత మంగళవారం ఉదయమే చెరువుల వద్దకు వెళ్తున్న దళితులు, పేదలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, పేదలకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం పేదలు సమిష్టిగా చెరువుల వద్దకు వెళ్లారు. తమ భూముల కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నా అధికారుల తాత్సార వైఖరిని ఖండించారు. రామకృష్ణ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు భూస్వాములకు, పేదలకు మధ్య రాయబారాలు నడపడం సిగ్గుచేటన్నారు. 15 నెలలుగా పేదలు మొక్కవోని దీక్షతో పోరాడుతుంటే రెవెన్యూ అధికారులు న్యాయం చేయాల్సింది పోయి భూస్వాములు ఇచ్చే లంచాలు మింగి పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులను అమాయకులను చేసి వారి జీవితాలతో రెవెన్యూ అధికారులు ఆడుకుంటున్నారని మండిపడ్డారు. మరోపక్క జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దళితులను ఉద్ధరిస్తామని చెబుతుంటే వారికి సంబంధించిన భూములను భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. జిల్లా కోర్టు పేదలకే భూములు పంచాలని ఆదేశించినా నేటికీ భూస్వాముల నుండి ఒక్క ఎకరం భూమి కూడా రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. జిల్లా అధికారులు పేదల పక్షమా.. లేక భూస్వాముల పక్షమా అని నిలదీశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు వెంటనే పేదలకు భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో జరిగే పరిణామాలకు మండల, జిల్లా, రెవెన్యూ అధికారులదే బాధ్యతని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.ఆనంద్‌రావు, నాగేంద్ర, సిహెచ్.మణి, భూపోరాట నాయకులు కుమారి, ఏసు మణి, మాణిక్యం, గంగాధర్, రవికుమార్, పవన్ లలిత పాల్గొన్నారు.



చెరువు వద్ద పేదలు, దళితుల ఆందోళన

ప్రేరేపితరహిత ఎన్నికల కోసం

ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్

ఏలూరు: ప్రేరేపిత రహిత ఎన్నికల కోసం పర్యవేక్షణను మెరుగుపర్చేందుకు ఎన్నికల సంఘం ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్ నిర్వహణ తీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించింది. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టరేట్ ఎన్ఐసి నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, పోలీస్, రవాణా, ఎక్సైజ్, అటవీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్‌లో పొందుపరిచిన వివిధ అంశాలను ఇసిఐ ఐటి విభాగం అధికారులు వివరించారు. గతేడాది దేశంలో ఐదు అసెంబ్లీ ఎన్నికల కోసం ఈ విధానాన్ని వినియోగించినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల వేళ అక్రమంగా తరలించే నగదు, మద్యం, డ్రగ్స్, ఉచిత బహుమతులు, విలువైన వస్తువులను సీజ్ చేసేందుకు ఇఎస్ఎంఎస్ సిస్టమ్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర విలువైన వస్తువులు పట్టుబడినప్పుడల్లా స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు యాప్‌లోకి సమాచారాన్ని అందజేస్తారన్నారు. అధిక విలువైన లావాదేవీల కదలికలపై నిఘా ఉంచేందుకు కూడా పలు రకాల అంశాలు పొందుపర్చారన్నారు. ఇఎస్ఎంఎస్ సిస్టమ్ యాప్ సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఎఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జెడి ఎన్.సూర్యచంద్రరావు, వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ డి.రాంబాబు, డిఎఫ్ఒ ఎం.హిమశైలజ, ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి, జిల్లా ఎక్సైజ్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.కుమరేశ్వరన్, ఎల్‌డిఎం డి.నీలాద్రి, జిల్లా ఇన్ఫర్మెటిక్ ఆఫీసర్ జివిఎస్ఆర్.శర్మ, కలెక్టరేట్ ఎఒ రమాదేవి పాల్గొన్నారు.

సమ్మె సక్సెస్ : విధుల్లోకి అంగన్వాడీలు

తమ సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా 42 రోజుల పాటు సమ్మె చేసి, వారి బాధను వివిధ రూపాల్లో వినూత్నంగా తెలియజేసిన అంగన్వాడీలు సమ్మె విరమించారు. రాష్ట్ర ప్రభుత్వంతో అంగన్వాడీ నేతలు జరిపిన చర్చలు సఫలం అవ్వడంతో వారు తిరిగి విధుల్లోకి చేరారు. సమ్మెకు సహకరించిన సిపిఎం, సిఐటియు, వివిధ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

అంగన్వాడీల 42 రోజుల సమ్మె పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించిందని వారి పోరాట పటిమతో అనేక విజయాలు సాధించారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. మంగళవారం ద్వారకాతిరుమలలో అంగన్వాడీల మండలస్థాయి విజయోత్సవ సభ అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ అంగన్వాడీల ఐక్యత పోరాటం ముందు రాష్ట్ర ప్రభుత్వ కుట్రలు ఓడిపోయాయన్నారు. దీర్ఘ కాలిక అనేక పెండింగ్ సమస్యలు పరిష్కారమైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బి.దేవానందం తదితర యుటిఎఫ్ నాయకులు పాల్గొని మాట్లాడారు. సంఘీభావనిది రూ.10 వేలు అంగన్వాడీ మండల నాయకులకు యుటిఎఫ్ నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు తులసి, నాగలక్ష్మి, హేమలత, సుధా, స్వర్ణలత పాల్గొన్నారు.

తాళాల కోసం అంగన్వాడీల నిరీక్షణ

ఉంగుటూరు : అంగన్వాడీలు సుదీర్ఘకాలం సమ్మె అనంతరం మంగళవారం విధులకు హాజరైయ్యారు. పలు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు సచివాలయం సిబ్బంది ఇవ్వడంలో ఆలస్యం కారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అంగన్‌వాడీలు కేంద్రాల బయటే నిరీక్షించాల్సి వచ్చింది. సమస్యలను గుర్తించిన సూపర్‌వైజర్లు ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లగా తాళాలు ఇవ్వడంతో ఎట్టకేలకు కేంద్రాలు తెరుచుకున్నాయి. కాగా పలు కేంద్రాల్లో రికార్డు బుక్స్, పిల్లలు ఆట బొమ్మలు మాయం అయ్యాయని పలువురు అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేశారు.

చాట్రాయి : 42 రోజుల పాటు అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల నిరవధిక సమ్మె ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించడంతో అంగన్వాడీలు హర్షం వ్యక్తం చేశారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిర్వహించిన సమ్మె విజయవంతం అవ్వడంతో వారు తిరిగి విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా వారి పోరాటానికి సహకరించిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, సిఐటియు నాయకులకు, సహకరించిన పత్రికా విలేకరులకు చాట్రాయి మండలం అంగన్వాడీ కార్యకర్తల, హెల్పర్ల యూనియన్ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ, ప్రమీల రాణి, స్వరూప రాణి, కుసుమకుమారి, జ్యోతి, పద్మ, సుధా పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం అవ్వడంతో అంగన్వాడీలు ఈనెల 22 అర్ధరాత్రి నుంచి సమ్మె ముగించారు. మంగళవారం ఐసిడిఎస్ ఆఫీస్‌కు వెళ్లి విధులకు హాజరు అవుతామని రాతపూర్వకంగా సిడిపిఒ పిఒ స్వర్ణ కుమారికి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిమాండ్స్ ఒప్పుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మె విజయవంతం కావడంతో బుట్టాయగూడెం ఆదివాసి విజ్ఞాన కేంద్రంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సమ్మెలో ఐదు రోజులుగా ప్రాణాలు సైతం లెక్కచేయకుండా నిరాహార దీక్షలో పాల్గొన్న మండలానికి చెందిన పూనం భూదేవిని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి మండల కార్యదర్శి కొండలరావు పాల్గొన్నారు.

కుక్కునూరు : 42 రోజుల పాటు జరిగిన అంగన్వాడీల సమ్మె విజయవంతం అయ్యిందని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. మంగళవారం అంగన్వాడీ సమ్మె విజయం సాధించిన సందర్భంగా విన్ ఆకారంలో వినూత్నంగా కూర్చున్నారు. సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ చేసి అనంతరం అంగన్వాడీల జాయిన్ లెటర్ సిడిపిఒ లక్ష్మీకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ ఎర్రజెండా అండతో 42 రోజుల పాటు అలుపెరుగని పోరాటం చేసి విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు పాల్గొన్నారు.



కుక్కునూరులో విన్ అని ఒదిగి హర్షం

అంగన్వాడీలకు అభినందనలు : ఐద్వా

ఏలూరు అర్బన్ : 42 రోజుల పాటు పోరాటం చేసి విజయం సాధించిన అంగన్వాడీలకు పేరుపేరునా ఐద్వా ఏలూరు జిల్లా కమిటీ అభినందనలు, జేజేలు తెలిపింది. ఈమేరకు ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా మొక్కవోని దీక్షతో వారి డిమాండ్లను పరిష్కరించుకున్నారని అభినందనలు తెలిపారు. పట్టుదలగా జిఒ విడుదల చేసేవరకు ఉండాలని, అలాగే అంగన్వాడీలకు ఐద్వా నిరంతరం అండదండలుగా ఉంటుందని ఈ ప్రకటనలో తెలియజేశారు.

పేరుకుపోయిన సమస్యలు పరిష్కారమయ్యేనా..!

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రజా సమస్యలను స్పందన కంటే వేగంగా పరిష్కరించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో కలిసి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలో గత కొంతకాలంగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారా లేదా ఎప్పటి స్పందన లాగే అర్జీలతో సరిపెట్టుకొని తూతూ మంత్రంగా సభ నిర్వహించేసి వెళ్లిపోతారా అనేది తెలియాల్సి ఉంది. ప్రధానంగా మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు సరైన రహదారులు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు కాని ప్రజా ప్రతినిధులు కాని వాటి వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో గిరిజన ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా రెవెన్యూ కార్యాలయంలో భూముల ఆన్‌లైన్‌లకు సంబంధించి, భూ రికార్డుల ప్రక్రియ రీ సర్వేకి సంబంధించి ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ స్పందనలో ఫిర్యాదులు చేసినా శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే తరుణంలో ఈనెల 24న జరగబోయే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వస్తున్నందున వారి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని వంకవారిగూడెం పంచాయతీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒంటెద్దు పోకడ నిర్ణయాలతో సుమారు 1,160 ఎకరాల్లో ఇటీవల నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు సైతం పచ్చ జెండా ఊపడంతో పాటు రెండుసార్లు గ్రామ సభలు నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాల గ్రామస్తులు ముక్తకంఠంతో గ్రామ సభల్లో నేవీ ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి అధికారులకు ఇచ్చారు. అయితే దానికి సంబంధించి ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన నిర్ణయం రాకపోవడంతో ఎప్పుడు ఏ సమస్య వచ్చి పడుతుందో అని భయపడుతున్నారు. దీనికి సంబంధించి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి కేంద్ర నేవీ ఆయుధ డిపోను మా ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేయనున్నారు.

నేడు జీలుగుమిల్లిలో జగనన్నకు చెబుదాం

మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల మైదానంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య అన్నారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాన్ని ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సభ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్, జిల్లాస్థాయి అధికారులు హాజరై అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ కార్యక్రమంలో సమస్యలు తెలుపుకోవచ్చని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందర్ సింగ్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, డిటి సందీప్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నేడు బంద్ లేదు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె విరమించిన నేపథ్యంలో ఈనెల 24న తలపెట్టిన రాష్ట్ర బంద్ నిలిపి వేసినట్లు వామపక్ష నేతలు తెలిపారు. మంగళవారం స్థానిక స్ఫూర్తి భవన్ సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ రాష్ట్రంలో 42 రోజుల అంగన్వాడీ మహిళల సమ్మె చారిత్రాత్మకం అన్నారు. సమ్మె ప్రారంభించిన నాటి నుంచి ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు నోటీసులు, టెర్మినేట్ లెటర్లు, ఎస్మా చట్టం ప్రయోగించడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించినప్పటికీ అనేక ఇబ్బందులను సైతం ఎదుర్కొని పోరాడి విజయం సాధించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి పట్టుదలకు పోయి 42 రోజులు ఆడపడుచులను చివరకు పండుగ దినాలలో కూడా రోడ్లపైనే కూర్చోబెట్టిందని విమర్శించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన ప్రభుత్వ వైఖరిని ఖండించారు. అర్ధరాత్రి అంగన్వాడీ యూనియన్లతో చర్చించి సమస్యను పరిష్కరించడాన్ని స్వాగతించారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన మాట ప్రకారం జీతాలు పెంచాలని, అంగీకరించిన అన్ని డిమాండ్లు తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అంగన్వాడీల సమ్మె ఇతర ఉద్యోగ, కార్మికులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు. అంగన్వాడీ యూనియన్లు సమ్మె విరమించిన నేపథ్యంలో వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు 24వ తేదీన తలపెట్టిన రాష్ట్ర బంద్ విరమిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రటరీ బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్ద వెంకట్రావు, ఎఐటియుసి నాయకులు పి.కన్నబాబు పాల్గొన్నారు.

వామపక్షాల నేతలు

అంగన్వాడీల విజయోత్సవ సభ

చింతలపూడి : ఉద్యమం ద్వారానే అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చుకున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ఎస్.సత్యనారాయణ అన్నారు. చింతలపూడి పట్టణంలో ఫైర్ స్టేషన్ వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. 42 రోజుల అంగన్వాడీ కార్యకర్తల సమ్మెకు సహకరించిన వివిధ వర్గాల వారికి సమ్మె శిబిరంలో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సరోజిని, బి.మాణిక్యం, బి.సరళ, ఎం.పద్మ, బి.ఫణి పరిధిని పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో మందుల పంపిణీ

ఉంగుటూరు : నారాయణపురంలో లవ్ ఇన్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వంగాయగూడెం గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. లవ్ ఇన్ యాక్షన్ సంస్థ అధ్యక్షుడు ఎస్.పాల్దినకరన్, ట్రెజరర్ ఎస్.అబ్బెల్, నాయకులు యు.ముసలయ్య, భుజంగరావు, కలపాల కుమార్ పాల్గొన్నారు.

పిఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని ఏలూరు కలెక్టరేట్లో మంగళవారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఇ కె.శేఖర్‌రావు, ఇఇ ఎం.వి.రమణ మూర్తి, జెసిని వైర్మన్ చౌదరి శ్రీనివాస్, పిఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వీరబాబు, పలువురు పిఆర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ల పరిశీలన

చింతలపూడి : మండలంలో ఓటర్ల తుది జాబితా పూర్తైందని చింతలపూడి ఇఆర్ఓ.గీతాంజలి అన్నారు. చింతలపూడి పట్టణంలో చింతలపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మేడపడి వద్ద పోలింగ్ బూత్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియ గురించి ఓటు నమోదైందా లేదా ఓటర్లను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

ఎంపీ సునీల్ను కలిసిన బాబూరావు

ముదినేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏలూరు ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్ను ఎంపిక చేయడం మంచి విషయమని రాష్ట్ర మాల మహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సేవ నాగ జగన్ బాబూరావు అన్నారు. మంగళవారం ఏలూరులో కారుమూరి సునీల్ కుమార్ను కలిశారు. కైకలూరు నియోజకవర్గంలో ఎస్సి, ఎస్టి, బిసి, ముస్లిం, మైనారిటీలు, వైసిపి అభిమానుల గురించి ఎంపీతో కొన్ని విషయాలు చర్చించుకున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ముసునూరు : విద్యార్థులు చిన్న వయసు నుంచి మంచిగా చదువుకుని రాష్ట్రపతి అబ్దుల్ కలాం వలె ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెడ్పిటిసి డాక్టర్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముసునూరు మండల ఎంపిపి కొండా దుర్గా భవానీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాధికా సత్యనారాయణ, ఎంపిటిసి తోట రమాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు : డిపిఒ

ఏలూరు : జిల్లాలో ప్రతి ఇంటికీ జల్ జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అన్ని చర్యలూ చేపడుతున్నామని డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో హర్ ఘర్ జల్ సంబంధించి గ్రామ సభలు జరపని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో డిపిఒ ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ వి.సత్యనారాయణలతో కలిసి కలెక్టరేట్లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ. శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ హర్ ఘర్ జల్ పథకంలో భాగంగా జిల్లాలో 4 లక్షల 80 వేల ఇళ్లకుగాను నాలుగు లక్షల ఎనిమిది వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. హర్ ఘర్ జల్ గ్రామాలుగా ఇప్పటికే 258 గ్రామాలను ప్రకటించారని, మిగిలిన 17 గ్రామాలను ఈ నెల 27 నాటికి ప్రక్రియ అంతా పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వాయిస్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, నవాజ్ పాల్గొన్నారు.

26న కవి గాయక కళా సమ్మేళనం

ఏలూరు : 75వ రిపబ్లిక్ డే సందర్భంగా ఈనెల 26 మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎంహెచ్ఎ హాల్లోగాని గురుమూర్తి కళా వేదికలో లౌకిక జనకవనం పేరుతో కవి గాయక కళా సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో రాజ్యాంగ విలువలపై కవితా గాన ఏకపాత్ర వేష ధారణలు–ఏక పాత్రలు, పాటలు, సందేశాలు ఏర్పాటు చేశారు. ఏలూరు పవరుపేటలోని అన్నే భవనంలో కార్యక్రమ ప్రచార బ్రోచర్, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుడిపాటి నరసింహారావు, డి.రాములు, డి.హేమ సుందర్, ఎస్.కస్తూరి రావు, పి.ఆంజనేయులు, వి.సురేష్, కె.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఇంటికి చేరుకున్న పదో తరగతి విద్యార్థి

ముదినేపల్లి : పదో తరగతి చదువుతున విద్యార్థి ఇటీవల అదృశ్యమై ఇంటికి చేరుకోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు మంగళవారం ఆనందం వ్యక్తం చేశారు. ముదినేపల్లికి చెందిన అబ్దుల్ సలాం కుమారుడు అబ్దుల్ మహమ్మద్ సల్మాన్ స్థానిక ప్రయివేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 19వ తేదీ శుక్రవారం స్కూలుకు వెళ్లిన సల్మాన్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి ఇంటి నుంచి స్కూల్కి వెళ్లకుండా బయటికి వెళ్లి నాలుగు రోజుల తర్వాత సోమవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపిలో బిసిలకు సముచిత స్థానం

ముదినేపల్లి : బిసిలకు సముచిత స్థానం ఇచ్చింది టిడిపియేనని జిల్లా టిడిపి ఇన్ఛార్జి గన్ని వీరాంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని వడాలి గ్రామంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ళ బుల్లయ్య, మాజీ ఎంఎల్సి కమ్మిల విఠల్, మాజీ ఎంపిపి వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, బొమ్మనబోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

చాట్రాయి : బిసి రక్షణ చట్టాన్ని సాధించాలంటే టిడిపిని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నూజివీడు నియోజకవర్గ టిడిని ఇన్ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. చాట్రాయి మండలం జనార్ధనవరం గ్రామంలో జయహో బిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

యువకుడి అనుమానాస్పద మృతి

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని మొగలి చెరువు సమీపంలో నివసిస్తున్న రోజువారి కూలీ కార్మికుడు పరస రంజిత్ కుమార్(28) సోమవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందటం సంచలనంగా మారింది. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి వివాహమైందని, తమ కుమారుడు మృతి పట్ల కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చైన్ స్నాచర్ అరెస్టు

ఆగిరిపల్లి : ఒంటరిగా నడుచుకొంటూ వెళ్తున్న మహిళల మెడలోని బంగారు తాడులను దొంగిలిస్తున్న చైన్ స్నాచర్ను అరెస్టు చేసిన సంఘటన ఆగిరిపల్లిలో నెలకొంది. ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తోటపల్లి, శోభనాపురం గ్రామాల్లో ఒంటరిగా నడుచుకొంటూ వెళ్తున్న ఇద్దరు మహిళల మెడలలోని బంగారు నాను తాడులను దొంగతనం చేసిన చిన్నాగిరిపల్లికి చెందిన జువ్వనబోయిన రామకృష్ణను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రూ.2 లక్షల 25 వేలు విలువ చేసే రెండు బంగారు నాను తాడులను స్వాధీనం చేసుకొని ముద్దాయిని నూజివీడు కోర్టుకు హాజరుపర్చినట్లుగా తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రకృతిని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ప్రతి వ్యక్తి బాధ్యతతో జీవనం సాగిస్తూ, ప్రకృతిని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని, సహజ జీవన విధానం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా న్యాయసేవాధికారి సంస్థ భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఎపి పొల్యూషన్ బోర్డ్ ఏలూరు సంయుక్తంగా జిల్లాలోని వివిధ శాఖల అధికారులతోనూ, పరిశ్రమల యాజమాన్యం, ఉద్యోగులతో 'పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ చెట్లను నాటడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగించటం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించడం మొదలైన కార్యక్రమాలను అవలంభించడం ద్వారా కొంతవరకు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. జిల్లా పర్యావరణ పరిరక్షణ బోర్డు ఇంజనీర్ ఇ.వెంకటేశ్వరావ్ మాట్లాడుతూ వ్యర్థాలను సరైన పద్ధతుల్లో రీసైకిలింగ్ చేయడం ద్వారా ఇంధన ఉత్పత్తి చేయవచ్చుని, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల రీసైకిలింగ్ విధానాన్ని సంబంధిత యాజమాన్యం పాటించాలని, అలాగే విధిగా శుద్ధి చేసిన తర్వాత మాత్రమే వ్యర్థాలను విడుదల చేయాలని సూచించారు. పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, అలాగే ఎలక్ట్రానిక్, ఆసుపత్రుల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో డిస్మాండిల్ చేయాలని, అలాగే ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించి జ్యూట్ వస్తువులను ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ శేషగిరిరావు, ప్యానల్ లాయర్లు కె.వెంకటేశ్వరరావు, కూనా కృష్ణారావు, కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదలు 'జగనన్న సురక్ష' సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి – మండవల్లి

రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసిందని, జగనన్న సురక్షను పేద ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచి భాను శేషగిరి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని పురస్కరించుకుని అయ్యవారి రుద్రవరంలో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేశారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ రూ.25 లక్షల వరకు పెంచారని అన్నారు. ఈ వైద్య శిబిరంలో 423 మందిని పరీక్షించి, మందులను పంపిణీ చేసి వారిలో నలుగురిని వైద్య నిమిత్తం వేరే హాస్పటల్‌కు పంపించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అప్పాపురం సర్పంచి బుర్ల భోగేశ్వరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ణ యాదవ్, ఎంపిటిసి సభ్యులు చిన్ని కృష్ణయాదవ్, వైస్ సర్పంచి ఇంటి నాగరాజు, తహశీల్దార్ రాజకుమార్, ఇఒపిఆర్‌డి ఆనందబాబు, కార్యదర్శి తోట శ్రీనివాసరావు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని మండల వైద్యాధికారి ఆంజనేయులు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం సచివాలయం–1లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : కామినేని

మండవల్లి : రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని పెరిగేగూడెం, కొర్లపాడు, గన్నవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నాడని, గత నాలుగు సంవత్సరాలుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదని అన్నారు. రాజధాని లేక పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకపోవడంతో పాటు కరెంట్ బిల్లులు మోత మోగిస్తున్నాయని మిమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరావు, నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, బోయిడి సురేష్ పాల్గొన్నారు.

29 నుంచి విద్యుత్ టారిఫ్లపై ప్రజాభిప్రాయ సేకరణ

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకూ చేపట్టనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఏలూరులోని విద్యుత్ భవన్‌తోపాటు తాడేపల్లిగూడెం, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురం కార్యాలయాల నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ రెండు గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో ముందుగా నమోదు చేసుకున్న వారి అభ్యంతరాలు మాత్రమే స్వీకరిస్తారని తెలిపారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ

నూజివీడు రూరల్ : ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ నూజివీడులో న్యాయవాదులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కోర్టుల వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ, పీజీ సెంటర్, చిన్న గాంధీ బొమ్మ, బస్టాండ్, రాజీవ్ సర్కిల్ మీదుగా కోర్టు వద్దకు చేరుకుంది. ఈ ర్యాలీలో న్యాయవాదులు ఇందుపల్లి సత్యప్రకాష్, భోగోలు చంద్రశేఖర్, మన్నం రమేష్, నక్కనబోయిన మురళీకృష్ణ పాల్గొన్నారు.

'పేదవాడి చేతిలో భూమి ఉండాలి'

ముసునూరు : కష్టపడి పనిచేసే పేదవాడి చేతిలో భూమి ఉంటేనే గ్రామాల అభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని నూజివీడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు అన్నారు. ఇదే విమలక్క సిద్ధాంతమని ఆయన కొనియాడారు. వచ్చేనెల ఫిబ్రవరి 12వ తేదీన సిపిఐ, రైతు సంఘాల ఆధ్వర్యంలో సాగులో ఉన్న అటవీ బంజరు భూముల రైతులకు హక్కు పట్టాలు ఇప్పించేందుకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పార్టీ కోసం కృషి చేసే కార్యకర్త, గ్రామస్తుడు అబ్బూరి రంగారావుకు చలసాని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, ఇస్లావతు శ్రీరాములు, ఇస్లావతు రాము పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఏలూరు అర్బన్ : ఏలూరు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు 27 డిమాండ్స్‌తో కూడిన వినతిని మంగళవారం జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. నగర పాలక సంస్థలో ఉద్యోగం చేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని యూనియన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఎ.అప్పలరాజు, బి.నారాయణరావు కలెక్టర్‌ను కోరారు. వినతిలో పేర్కొన్న 27 అంశాలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి కమిషనర్‌కు సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీ చేశారు. సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్‌కు యూనియన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

బాలల సంరక్షణ అందరిదీ

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

బాలలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని జిల్లా బాలల సంరక్షణ కార్యాలయం ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ఆఫీసర్ సిహెచ్.శ్రీకాంత్ చెప్పారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కెవిఎల్.పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సిఎస్.సూర్య చక్రవేణి ఆదేశాలపై మంగళ వారం దెందులూరులో సైనికుల పేటలో కమ్యూనిటీ మహిళలతో జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా జాతీయ బాలిక దినోత్సవం ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీకాంత్ మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య లీడర్ సింహాచలం, దిసా వన్ స్టాప్ సెంటర్ సిహెచ్.జయలక్ష్మి, డ్వాక్రా మహిళలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

బోస్ సేవలు స్ఫూర్తిదాయకం : ఎంఎల్ఎ


బోస్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

భారతావని మహోన్నతికి నేతాజి సుభాష్ చంద్రబోస్ అందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని ఎంఎల్ఎ ఆళ్ల నాని పేర్కొన్నారు. స్థానిక పవర్ పేట బోస్ శిబిరం వద్ద మంగళవారం నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నేతాజీ విగ్రహానికి పుష్పమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బోసు శిబిరం వద్ద సుమారు రూ.10 లక్షల వ్యయంతో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోస్ శిబిరాన్ని కాపాడుతూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్న కమిటీ సభ్యుల కృషి అభినందనీయమన్నారు. బోస్ శిబిరం అభివృద్ధికి మరింత చేయూత అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఎమ్సి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్‌లు ఎన్.సుధీర్ బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, నగర కమిషనర్ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ ఇన్ఛార్జి బడేటి రాధాకృష్ణ 41 కేజీల కేక్ కట్ చేశారు. అనంతరం సుమారు 40 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉప్పాల జగదీష్ బాబు, మాజీ మంత్రి మరడాని రంగారావు, దాసరి ఆంజనేయులు, పూజారి నిరంజన్, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రజలకు మంచి పాలన అదించాలనే లక్ష్యంతో యువగళం పాదయాత్ర చేశారని, ప్రజల సమస్యలు తెలుసుకొని 2024లో అధికారంలో వచ్చాక వాటిని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పరిష్కరిస్తారని చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 41వ జన్మదినం సందర్భంగా స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా అధ్యక్షతన నియోజకవర్గ టిడిపి మహిళా నాయకురాలు యాళ్ల లీలా ప్రశాంతి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని చాట్రాయి గ్రామంలో మండల టిడిపి కార్యాలయంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, యువగళం రథసారథి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి, విజయ మిల్క్ డైరెక్టర్ బొట్టు రామచంద్ర రావు, మాజీ ఎంపిపి కందుల కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి గ్రామ టిడిపి అధ్యక్షులు గడ్డం ప్రభాకర్ రెడ్డి, కొత్తపల్లి రాందాస్, వెల్ది అప్పారావు పాల్గొన్నారు.

కలిదిండి : నారా లోకేష్ 41వ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని మట్టగుంటలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. కలిదిండిలో టిడిపి నాయకుడు కొడాలి వినోద్, మండల టిడిపి అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కలిదిండిలో కొడాలి వినోద్ సుమారు 1,200 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, బళ్ల రాజు, నాగిడి వీరబ్రహ్మం, కొపనాతి వెంకటేశ్వరరావు, కోకా తాతయ్య పాల్గొన్నారు.

ముదినేపల్లి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి ముదినేపల్లిలో టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నారా లోకేష్ జన్మదిన వేడుకలు సందర్భంగా స్థానిక గుడ్లవల్లేరు రోడ్డులో పార్టీ నాయకులు భారీగా బాణాసంచి కాల్చారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కొడాలి వినోద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ముసునూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకులు నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ముసునూరు మండలం గుడిపాడు గ్రామంలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో టిడిపికి దశ దిశ నారా లోకేష్ అని అనటంలో సందేహం లేదని తెలియజేశారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

ఎంపిడిఒ జి.శ్రీను

ప్రజాశక్తి – పోలవరం

డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని డ్వాక్రా సిఎలకు ఎంపిడిఒ జి.శ్రీను సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25 సంవత్సరం కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపిఎం బి.శ్రీనివాసరావు తెలిపారు. పోలవరం మండలం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ జి.శ్రీను ఆధ్వర్యంలో డ్వాక్రా సిఎలకు ఈనెల 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటిటి యు.రాజారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పేదరికంలేని, ఆరోగ్యకరమైన, నీటి ఎద్దడి లేని గ్రామంగా తీర్చిదిద్దడంలో డ్వాక్రా సంఘాల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుస్థిరాభివృద్ధి 17 లక్ష్యాలను 9 థీమ్స్‌గా విభజించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25 సంవత్సరానికి తయారు చేయడం, తదితర అంశాలపై శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, సెక్రటరీ వై.కొండలరావు, విఎస్‌వి ఎన్.మూర్తి పాల్గొన్నారు.

ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఏలూరు టౌన్ : చిరు ధాన్యాల సాగులో ఆధునిక వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్ర ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. పెదవేగి మండలం పెదకడిమి గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏలూరు వ్యవసాయ శాఖ ఏరువాక కేంద్రం సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన చిరుధాన్యాల సాగులో జోడింపు విలువ అనే అంశంపై రైతులకు అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ భరతలక్ష్మి మాట్లాడుతూ రైతులు తమ పంట భూముల్లో ప్రత్యామ్నాయ పంటల విధానం అవలంభించాలన్నారు. పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మణిరత్నం, ఉండి(కెవికె) ప్రధాన శాస్త్రవేత్త (కమ్యూనిటీ సైన్స్) డాక్టర్ ఎన్.డెబోరా మెస్సయ్యాన్, శాస్త్ర వేత్తలు సుధీర్ కుమార్.ఫణి కుమార్, వీరబాబు, నాగేంద్ర బాబు తదితరులు పంటల మార్పిడి విధానం చిరుధాన్యాల సాగులో అధిక దిగుబడులు సాధించడం ద్వారా రైతు అధిక లాభాలు పొందవచ్చని వివరించారు.

25న షర్మిల ఏలూరు రాక

ఏలూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ, జిల్లాలోని మండల కాంగ్రెస్ వివిధ అనుబంధ సంఘాల కార్యకర్తలు, నాయకులతో చర్చించడానికి ఏలూరు విచ్చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు తెలిపారు. ఈ సమావేశానికి అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఏలూరు : ఏలూరు 24వ డివిజన్ మదిరి నిర్మల ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం ఎంఎల్ఎ ఆళ్ల నాని చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, మేయర్ నూర్జహాన్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు, గుడిదేశీ శ్రీనివాస్, నూక పెయి సుధీర్ బాబు, ఏలూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నెరుసు చిరంజీవి, క్లస్టర్–1 ప్రెసిడెంట్ సుంకర చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎపిడెమియాలజిస్ట్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

ఐడిఎస్‌పిలో ఖాళీగా ఉన్న ఎపిడెమియాలజిస్ట్ ఉద్యోగం భర్తీకి ఒక సంవత్సరం పాటు ఒప్పంద ప్రాతిపదికన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు వారి ఆధీనంలో పనిచేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ ధరఖాస్తులకు అన్ని సర్టిఫికేట్‌లను జతపరచి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయం, ఏలూరులో ఈనెల 25వ తేదీ వరకు కార్యాలయం పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలన్నారు. తగిన అర్హతగల ధృవపత్రాలు జతచేసి, దరఖాస్తులో ఖాళీలను పూరించి ఇవ్వాలన్నారు. లేనిచో అవి తిరస్కరించబడునని తెలిపారు. ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవన్నారు. ఖాళీల సంఖ్య పెంచుటకు, తగ్గించుటకు, అమలు చేయుటకు, నిలుపుదల చేయడానికి జిల్లా నియామకపు కమిటీ, ఏలూరు జిల్లా వారికి పూర్తి అధికారం కలదని తెలియజేశారు. పూర్తి వివరాలకు, ఉద్యోగ నియామకాల వివరాలు, దరఖాస్తుకు ఆన్‌లైన్‌లో https://westgodavari.ap.gov.in, https://eluru.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని తెలపారు.

ప్రకటన

నా క్లయింటు ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, వేగివాడ గ్రామం, బస్టాండ్ దగ్గర, ఆంజనేయస్వామి గుడి దగ్గర, డోరు నెం. 7-607రు గ్రామ కాపురస్తురాలైన **శ్రీ కొనకళ్ళ మోహన్‌కుమార్ గారి భార్య అయిన కొనకళ్ళ ఫణీంద్ర స్వాతి** (ఆధార్ నెం. 4408 2150 0238) – నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా–

నా క్లయింటు అయిన కొనకళ్ళ మోహన్‌కుమార్ గారి భార్య అయిన కొనకళ్ళ ఫణీంద్ర స్వాతి గారి ఆస్తికి చెందిన **లింకు డాక్యుమెంటు నెం. 45/2002,** తేది. 23-01-2002న దరిమిలా నా క్లయింటు సదరు డాక్యుమెంట్లు గల సంచిని తీసుకొని ది. 19-01-2024వ తేదీన బండి మీద వేగివాడ నుండి పెదవేగి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో డాక్యుమెంట్లు ఎక్కడో పడిపోయినవి. ఎంత వెతికినను దొరకలేదు. సదరు ఆస్తికి సంబంధించిన మెయిన్ డాక్యుమెంటు నెం. 5966/2023, తేది. 29-11-2023 రీత్యా నా క్లయింటునకు సంక్రమించిన క్లయింటు స్వాధీన హక్కుభుక్తముతో ఉండి ఉన్నది.

సదరు ఆస్తికి చెందిన లింకు డాక్యుమెంటు నెం. 45/2002, తేది. 23-01-2002 ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటు (సెల్: 9553215673)నకు ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజుల లోపుగా అందజేయగలరు. సదరు దస్తావేజులతో ఎవరైనా లావాదేవీలు జరిపిన యెడల అవి చెల్లనేరవు. అంతేకాక, ఎటువంటి లావాదేవీలు జరిపినా వారిపై చట్టరీత్యా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును. తదుపరి వచ్చిన క్లయిములు ఏమీ నా క్లయింటును బైండ్ ఓవర్ చేయజాలవు.

స్థలం: ఏలూరు, తేది:23-01-2024

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ & నోటరీ, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్
ఏలూరు కోర్టు సెంటర్, సెల్: 9440111033

మహారాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా
ఐ.ఎ. నెం. 662/2022 ఇన్
ఒ.ఎస్. 45/2017

Between:

PETITIONERS/ DEFENDANTS:

1. BASF India Ltd., Regd. Office at the Capital, 'A' Wing, 1204-C, 12th Floor, Plot No. C-70, 'G' Block Bandra Kurla Complex, Bandra (East) Mumbai 400051. Rep. by its athorized signatory Tejal Bhavin Panchamia, W/o. Bhavin Vinod Panchamia, aged 42 years, Manater Legal.
2. Ashok John Kosky, S/o. late E.J.Koshy, aged 45 years, Employee, C/o. The Capital, 'A' Wing, 1204-C, 12th Floor, Plot No. C-70, 'G' Block, Bandra Kurla Complex, Bandra (East) Mumbai 400051.

RESPONDENT/ PLAINTIFF:

Jagarlamudi Ramprasad, S/o. Nageswara Rao, Hindu, Male, aged 41 years, R/o. D.No. 2-15, Kamavarapukota Village and Mandal, W.G.Dist.,

పై నెంబరు ఐ.ఎ.లో గల దావాలో మీరు అనగా జాగర్లమూడి రామ్‌ప్రసాద్ గారు రెస్పాండెంట్ అయివున్నారు. మీకు కోర్టు వారు ఎన్నిమార్లు నోటీస్లు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 31-01-2024వ తేదీన మీరు గాని, లేక మీ లాయర్ గారి ద్వారా గాని ఉదయం 10.30 గంటలకు** కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ సంజాయిషీ తెలుపుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షంలో పై నెంబరు గల ఐ.ఎ. తీర్మానించబడును.

యస్.రఘురామ్
యమ్.ప్రభాకర్
పి.కె.డి.భవాని, అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 8520811119, 9440114136

మహారాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా
ఐ.ఎ. నెం. 663/2022 ఇన్
ఒ.ఎస్. 45/2017

Between:

PETITIONERS/ DEFENDANTS:

1. BASF India Ltd., Regd. Office at the Capital, 'A' Wing, 1204-C, 12th Floor, Plot No. C-70, 'G' Block Bandra Kurla Complex, Bandra (East) Mumbai 400051. Rep. by its athorized signatory Tejal Bhavin Panchamia, W/o. Bhavin Vinod Panchamia, aged 42 years, Manater Legal.
2. Ashok John Kosky, S/o. late E.J.Koshy, aged 45 years, Employee, C/o. The Capital, 'A' Wing, 1204-C, 12th Floor, Plot No. C-70, 'G' Block, Bandra Kurla Complex, Bandra (East) Mumbai 400051.

RESPONDENT/ PLAINTIFF:

Jagarlamudi Ramprasad, S/o. Nageswara Rao, Hindu, Male, aged 41 years, R/o. D.No. 2-15, Kamavarapukota Village and Mandal, W.G.Dist.,

పై నెంబరు ఐ.ఎ.లో గల దావాలో మీరు అనగా జాగర్లమూడి రామ్‌ప్రసాద్ గారు రెస్పాండెంట్ అయివున్నారు. మీకు కోర్టు వారు ఎన్నిమార్లు నోటీస్లు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 31-01-2024వ తేదీన మీరు గాని, లేక మీ లాయర్ గారి ద్వారా గాని ఉదయం 10.30 గంటలకు** కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ సంజాయిషీ తెలుపుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షంలో పై నెంబరు గల ఐ.ఎ. తీర్మానించబడును.

యస్.రఘురామ్
యమ్.ప్రభాకర్
పి.కె.డి.భవాని, అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 8520811119, 9440114136